జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన రాష్ట్రాన్ని కల్తీ రాజ్యంగా మార్చింది. కోవిడ్ మందులు, మద్యం, ఇసుక, విద్య వ్యవస్థ అన్నింటిలోనూ కల్తీ చేశారు. చివరకు తిరుమల లడ్డూ నెయ్యి కల్తీతో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 07.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్


తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 291 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

- 2027 డిసెంబరు నాటికి అందరికీ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకం
- 14 విశిష్ట భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకం...రికార్డుల ట్యాంపరింగ్ కు ప్రయత్నిస్తే జైలుకే
- తాడేపల్లి వద్ద హెలిపాడ్ కోసం ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారు
- కర్నూలు జిల్లా కలుగట్లలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో సీఎం చంద్రబాబు





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ను భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2027 డిసెంబరు నాటికి సర్వే పూర్తి చేసి రాష్ట్రంలో రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కలుగొట్ల గ్రామంలో మీ భూమి-మీహక్కు కింద పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. భవిష్యత్‌లో ఎవరూ ట్యాంపరింగ్ చేయకుండా, ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా ట్యాంపరింగ్ కు ప్రయత్నిస్తే నేరుగా జైలుకే వెళతారని, అవసరమైతే పీడీ యాక్టు కింద కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ... మీ భూమికి భద్రత కల్పించడం నాకు ఆనందాన్నిస్తోంది. భూమి ఆస్తి ఒక్కటే కాదు.. అది మన జీవనాధారం. కుటుంబానికి భద్రత. భవిష్యత్‌కు నమ్మకం. కూటమి ప్రభుత్వం భూమి- నీరు-సాగుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వివాదాలు లేని భూములు, పుష్కలంగా ప్రతి ఎకరాకు నీరు, లాభాలు తెచ్చిపెట్టేలా సాగును ప్రోత్సహించటమే లక్ష్యాలుగా పెట్టుకుని పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడమే నా జీవితాశయం. కర్నూలు జిల్లాలో పశ్చిమ తాలూకాకు నీరు అందిస్తే మిగతా 2లో...



# కుర్రాళ్లు మళ్లీ కొట్టేశారు ...


## అండర్ - 19 వరల్డ్ కప్ విజేత భారత్

**హరారే:** అండర్-19 వన్డే ప్రపంచకప్ విజేతగా భారత జట్టు నిలిచింది. జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానం వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత ప్లేయర్లు అదరగొట్టారు. ఎక్కడా ఇంగ్లాండ్‌కు అవకాశం ఇవ్వకుండా మ్యాచ్ ప్రారంభం నుంచే పైచేయి సాధించారు. ఇంగ్లాండ్‌పై ఏకంగా 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. దీంతో ఆరోసారి టైటిల్‌ను చేజిక్కించుకుంది.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుతున్న భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. వైభవ్ సూర్యవంశీ (175) మెరుపు ఇన్నింగ్స్‌తో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే అర్ధ శతకం(53)తో రాణించగా.. అభిజ్ఞాన్ కుందు(40), వేదాంత్ త్రివేది (32) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3, మోర్గాన్ 2, అలెక్స్ గ్రీన్ 2, మానీ ఒక వికెట్ తీశారు.

412 పరుగుల భారీ లక్ష్య చేధనలో క్రీజులోకి వచ్చిన ఇంగ్లాండ్ బ్యాటర్లు కూడా పర్వాలేదనిపించారు. ఓపెనర్ బెన్ డాకిన్స్ 66 ,బెన్ మేయెస్ 45, ఫాల్కనర్ 115 పరుగులు, థామస్ 31, జేమ్స్ మింటో 28 పరుగులు చేశారు. మొత్తంగా 40.2 ఓవర్లు ఆడిన ఇంగ్లాండ్ 311 పరుగులు చేసి ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో అంబ్రీష్ మూడు, దేవేంద్రమ్, చౌహాన్ చెరో రెండు, పటేల్, ఆయూష్ తలో వికెట్ తీశారు.

## ఈ నెల 16న రాష్ట్రానికి బిల్ గేట్స్



- సీఎం చంద్రబాబుతో కీలక భేటీ... ఆరోగ్యం, విద్య, వ్యవసాయంపై ఏఐ సహకారం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. తొలుత ఆయన పర్యటన 18న ఉంటుందని భావించినప్పటికీ, షెడ్యూల్ ముందుకు రావడంతో 16న రాష్ట్రానికి చేరుకోనున్నారు. ఆయన పర్యటన ఒక్క రోజేనా లేదా రెండు రోజులు కొనసాగుతుందా అన్న విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఈ పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో బిల్ గేట్స్ కీలక సమీక్ష సమావేశంలో పాల్గొననున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతను వినియోగించే దిశగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

ఆరోగ్య రంగంలో అత్యాధునిక సాంకేతికత ద్వారా వ్యాధుల పర్యవేక్షణ, చికిత్సల నాణ్యత మెరుగుదల లక్ష్యంగా ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో మిగతా 2లో...

## రాష్ట్రంలో సరికొత్త సాంకేతిక విప్లవానికి

# శ్రీకారం



### కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశ భవిష్యత్ సాంకేతిక రంగాన్ని మలుపుతిప్పే చారిత్రక ఘట్టానికి అమరావతి శనివారం వేదికగా నిలవనుంది. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి రేపు పునాదిరాయి పడుతోంది. దీని ద్వారా భారతదేశం క్వాంటమ్ విప్లవానికి నాయకత్వం వహించే అవకాశం రాష్ట్రానికి రానుంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీని కోసం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించింది. మిగతా 2లో...

# దేవుని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచేశారు

- టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లు
- నేడు క్లీన్ చిట్ వచ్చిందంటూ టీం 11 తప్పుడు ప్రచారం
- టీం 11 దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి
- విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది
- దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో ఏపీకి 25శాతం వస్తున్నాయి
- బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్ నిర్మాణం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బూత్ మేనేజ్ మెంట్ వర్క్ షాప్ లో మంత్రి లోకేష్ దిశానిర్దేశం

2 లో



# పరీక్షలను పండుగలా చేసుకోవాలి

- మీకు సరిపడే మార్గాన్నే ఎంచుకోండి
- పరీక్షా పే చర్చలో విద్యార్థులకు మోదీ సూచన

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** పరీక్షల సమయంలో ఇతరులతో పోల్చుకుంటూ గందరగోళానికి గురికాకుండా, తమకు అనువైన ప్రిపరేషన్ పద్ధతినే బలంగా నమ్మాలని విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితేనే విజయం సాకారమవుతుందని చెప్పారు. సలహాలు తీసుకున్నా, వాటిలో నుంచి వ్యక్తిగతంగా ఉపయోగపడే విధానాన్నే ఎంపిక చేసుకోవాలని సూచించారు.

శుక్రవారం న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో 9వ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని ప్రధాని నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థులతో ఆయన ప్రత్యక్షంగా సంభాషించారు. సీబీఎస్ఈ, ఐఎస్‌సీఈ, రాష్ట్ర బోర్డు పరీక్షలు సమీపిస్తున్న వేళ ఈ కార్యక్రమం నిర్వహించారు.

**ఇంటర్నెట్ బానిసత్వానికి దూరంగా ఉండాలి :** డేటా చౌకగా లభిస్తోందని ఆన్‌లైన్‌లో అనవసరంగా కాలం వృథా చేయొద్దని హెచ్చరించారు. సరదాగా గేమ్స్ ఆడుతూ జీవితాన్ని పాడు చేసుకోకూడదన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ జూదం యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని చెప్పారు.

**పరధ్యానంతో సక్సెస్ సాధ్యం కాదు :** చదువును భారం అనుకోకుండా, లక్ష్యాన్ని చేరుకునే మార్గంగా భావించాలని మోదీ తెలిపారు. పరధ్యానంతో చదివితే జీవితంలో విజయాన్ని అందుకోలేరని హెచ్చరించారు. ముందుగా మనసును ప్రిపరేషన్‌కు సిద్ధం చేసుకుని, సబ్జెక్టులతో అనుబంధం పెంచుకోవాలని సూచించారు.

**ఒక్కొక్కరిది ఒక్కో శైలి :** విద్యార్థులందరూ ఒకే విధంగా చదవలేరని మోదీ చెప్పారు. కొందరికి ఉదయం, మరికొందరికి రాత్రి చదవడం అనుకూలమని తెలిపారు. అందుకే తమకు సరిపోయే టైమ్, పద్ధతినే ఎంచుకోవాలని సూచించారు. 2లో...



## వినయ విధేయ విద్యార్థి

# నారా లోకేష్

- మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర శివాజీతో రాజకీయ పాఠాలు చెప్పించుకున్నారు
- రాజకీయాలు, విలువలు, పార్టీ బలోపేతం, మంత్రిత్వ శాఖల గురించి చర్చ
- శివాజీని సాదరంగా ఆహ్వానించి, కలిసి భోజనం చేసి యోగక్షేమాలు తెలుసుకున్న లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నేర్చుకోవడంలో నిత్య విద్యార్థి, పెద్దలను గౌరవించడాన్ని బాధ్యతగా ఆచరించే యువకుడు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. తన తండ్రితోపాటు సమానంగా మిగతా 2లో...

## రూ. 97 కోట్లతో 'అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు'



3లో

- సమిష్టి కృషితో 2027 గోదావరి పుష్కరాలను విజయవంతం చేయాలి: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో గోదావరి పుష్కరాల సన్నద్ధతపై తొలి ప్రాథమిక సమీక్ష
- కుంభమేళా తరహాలో 'టెంట్ సిటీలు', 'హోమ్ స్టే'ల ఏర్పాటుకు ప్రాధాన్యత
- ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుణ్యఫలం ఒకటే - భక్తులలో అవగాహన కల్పించాలని నిర్ణయం

**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్):** సమిష్టి కృషితో 2027 జూన్ 26న ప్రారంభమై 12 రోజులపాటు కొనసాగి జులై 7న ముగిసే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టరేట్ కార్యాలయంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన ప్రాథమిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనవరి 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అమరావతిలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ భేటీకి అనుసంధానంగా ఈ రోజు జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## బోధనాసుపత్రుల్లో హెర్బల్ గార్డెన్స్



- రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని పంచేలా..!
- వాకింగ్ ట్రాక్ తోపాటు ఇతర సౌకర్యాలు!
- స్థలాల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఔషధ మొక్కల తోటల (హెర్బల్ గార్డెన్స్) ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని పంచేలా ఈ తోటల్లో పూల, ఔషధ మొక్కలను నాటతారు అలాగే వాకింగ్ ట్రాక్, బెంచీలు, మంచినీటి సదుపాయాన్ని కల్పించేందుకు అనువైన స్థలాలను అదికారులు పరిశీలిస్తున్నారు. తొలివిడతలో డైరెక్టరేటు ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో ఉన్న అన్ని బోధనాసుపత్రులు, 2లో...

## స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో

# ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలి




- పేదరికంలేని సమాజ నిర్మాణానికి తమ వంతు సేవలందించాలి
- నూతన సాంకేతిక విధానంతో పారదర్శకంగా ప్రజలకు దగ్గరవ్వాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శుక్రవారం జిల్లా, మండల, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులకు, అర్బన్ స్వర్ణ వార్డు అధికారులకు రెండు రోజుల అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, మిగతా 3లో...

## పరీక్షలను పండుగలా చేసుకోవాలి



(మొదటి పేజీ తరువాయి)

**ఉపాధ్యాయులే మార్గదర్శకులు :** విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. విద్యార్థుల కంటే ముందుగా, వేగంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

**గతం కాదు - భవిష్యత్తే ముఖ్యం :** గతంలో జరిగిన వాటిపై కాకుండా, ముందున్న అవకాశాలపై దృష్టి పెట్టాలని ప్రధాని సూచించారు. మార్కులకే పరిమితం కాకుండా జీవన వికాసంపైనా దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో 4.5 కోట్ల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2018 నుంచి ఏటా పరీక్షల ముందు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## ఈ నెల 16న రాష్ట్రానికి బిల్ గేట్స్

(మొదటి పేజీ తరువాయి)

డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించే ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో 'సంజీవని' ప్రాజెక్టు అమలులో ఉంది. ఈ అన్ని అంశాలపై సీఎంతో జరిగే భేటీలో గేట్స్ చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

దీనితో పాటు అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాష్ట్రాన్ని సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఈ సమావేశం కీలకంగా మారనుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇదిలా ఉండగా, ఈ నెల 19న దిల్లీలో జరగనున్న ఏఐ సమిట్‌లో బిల్ గేట్స్ పాల్గొననున్నారు. ఈ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా హాజరుకానున్నారు. దీంతో రాష్ట్రానికి సంబంధించిన పలు సాంకేతిక, అభివృద్ధి అంశాలపై మరింత పురోగతి సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వినయ విధేయ విద్యార్థి నారా లోకేష్



(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాల్లో వచ్చిన వ్యక్తి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న తనయుడు, నాలుగు దశాబ్దాలకు పైగా తెలుగుదేశం పార్టీకి సేవలు అందించిన సీనియర్ నేత, మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. లోకేష్ ప్రత్యేక ఆహ్వానం మేరకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీకి ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో ప్రస్తుత రాజకీయాలు, ఆ నాటి రాజకీయాలు, నైతిక విలువలు, పార్టీ బలోపేతం, నాడు పనిచేసిన శాఖల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గౌతు శివాజీతో కలిసి భోజనం చేశారు. శివాజీ అలనాటి ముచ్చట్లు చెబుతుంటే ఆసక్తిగా విన్నారు. పెద్దలను గౌరవించడం తల్లిదండ్రుల ద్వారా చిననాటి నుంచే అలవర్చుకున్న నారా లోకేష్, సీనియర్ల నుంచి సలహాలు తీసుకోవడంలోనూ, తెలియని విషయాలు నేర్చుకోవడంలోనూ నిత్య విద్యార్థిగా మారతారని గౌతు శివాజీతో భేటీ వల్ల మరోసారి రుజువయ్యింది.

## రాష్ట్రంలో సరికొత్త సాంకేతిక విప్లవానికి శ్రీకారం



(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 2.45 గంటలకు క్యాంప్ ఆఫీస్ నుంచి ముఖ్యమంత్రి బయలుదేరి 3.00 గంటలకు ఉద్దండరాయునిపాలెం చేరుకుంటారు. సాయంత్రం 6.00 గంటల వరకు జరిగే క్వాంటమ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు.

**రాష్ట్రానికి, దేశానికి మైలురాయి :** అమరావతిలో రూపుదిద్దుకుంటున్న క్వాంటమ్ వ్యాలీ రాష్ట్రానికి, దేశానికి మైలురాయిగా నిలవనుంది. భారతదేశపు మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, ఉత్పత్తి, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ చోటు దక్కనుంది. ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలపాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు తలపెట్టారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక్నాలజీ సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకోసిస్టం విస్తరణ, లక్షలాది యువతకు నైపుణ్య శిక్షణ, పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు సాధ్యం కావాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు.

**సామాన్యుడికి ఎంతో ఉపయోగం :** క్వాంటమ్ టెక్నాలజీతో సామాన్యుడి జీవితంలో మార్పు వస్తుంది. క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతం కావడం, వ్యాధుల నిర్ధారణ మెరుగుపడడం, వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, నీటి వినియోగం, దిగుబడి అంచనాలు కచ్చితత్వంతో ఉండడం, బ్యాంకింగ్–డిజిటల్ లావాదేవీల భద్రత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందనున్నాయి. ఆగస్టు నాటికి క్వాంటమ్ వ్యాలీ భవనం సిద్ధం చేసి, డిసెంబర్ కల్లా క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాయకత్వం వహించినట్లే..., అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచంలోని బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి క్వాంటమ్ కేంద్రాలతో సమానంగా నిలుస్తుంది. భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి ప్రపంచ కేంద్రంగా మారుతుంది.

# భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రమంతటా నీరు ఇచ్చినట్టే. వారసత్వంగా వచ్చిన ఆస్తిపై వేరే వారి ఫొటోలు వేయడమేంటని గత ఎన్నికల్లో నేను ప్రశ్నించాను. గత పాలకులు తప్పుడు విధానాలతో ప్రజలను బానిసలు చేయాలని కుట్ర చేశారు. లోపభూయిష్టమైన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తెచ్చారు. ప్రజల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. పట్టాదారు పాసు పుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై వారి ఫొటోలు, పేర్లు ముద్రించుకున్నారు. వాళ్లు అడిగిన భూములు ఇవ్వకపోతే 22 ఏలో పెట్టారు. కక్ష తీర్చుకోవడానికి అన్ని ఆయుధాలు ఉపయోగించారు. ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు పులివెందుల నుంచి మనుషులను తెచ్చుకున్నారు. రీ సర్వే పేరుతో రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. పట్టాదారు పాసు పుస్తకాలపై ఫొటోలు వేసుకోవడం శాడిజం కాదా? లక్షల ఎకరాల ప్రైవేటు భూములను ప్రభుత్వ భూములుగా మార్చేశారు. రికార్డులు తారుమారు చేశారు. తాడేపల్లి ప్యాలెస్ పక్కన హెలీప్యాడ్ కోసం..70 ఏళ్లుగా పక్కా డాక్యుమెంట్లు ఉన్న భూమిని ఒక వ్యక్తి దగ్గర బలవంతంగా తీసుకుని ప్రభుత్వ భూమిగా మార్చేశారు. ఇదేమని అడిగితే 22 ఏలో పెట్టి వివాదం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల వద్ద నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతం పైగా అర్జీలు రెవెన్యూ పరమైనవే వస్తున్నాయి. రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించి ఏమీ తెలీనట్టు గత ఐదేళ్లు బ్రహ్మాండంగా పాలన చేసినట్టు మాట్లాడుతున్నారు. మీరు సమర్థవంతంగా పని చేస్తే ఇన్ని సమస్యలు ఎలా వచ్చాయి? నేను నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాను. నా జీవితంలో ఇలాంటి భూ సమస్యలు ఎప్పుడూ చూడలేదని" సీఎం చంద్రబాబు అన్నారు.

**పైసా అవినీతి లేకుండా పాస్ పుస్తకాల పంపిణీ :** "అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. భవిష్యత్ లో ఎవరూ ప్రజల భూమిపై కన్ను వేయకుండా భద్రత కల్పిస్తున్నాం. ప్రతీ పాస్ పుస్తకానికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, యూనిక్ నెంబర్ ఉంటుంది. ఎవరైనా సరే ఈ క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను వెంటనే తెలుసుకోవచ్చు. మీ పాసు పుస్తకంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను మీ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే అందులో వచ్చే మ్యాప్ మిమ్మల్ని నేరుగా మీ పొలం వద్దకు తీసుకు వెళుతుంది. డాక్యుమెంట్ల వివరాలను ట్యాంపర్ చేయకుండా



బ్లాక్ చైన్ లాంటి పటిష్ట వ్యవస్థను తెస్తున్నాం. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. మీ రికార్డులన్నీ మీ అనుమతితోనే చేస్తున్నాం. ముందుగా డ్రాఫ్ట్ పట్టాదార్ పాస్‌బుక్ జారీ చేసి అందులో వ్యక్తిగత వివరాలు, భూమి వివరాలు సరిగ్గా ఉన్నాయో, లేవో భూ యజమానులు నిర్ధారించుకునే అవకాశం ఇచ్చాం. వెబ్‌జ ధృవీకరణ తప్పనిసరిగా తీసుకుంటున్నాం. దీంతో తప్పులు దొర్లేందుకు వీలుపడదు. పైసా అవినీతి లేకుండా పట్టాదారు పుస్తకాలు ఇస్తున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రాష్ట్రంలో మొత్తం 279 గ్రామాల్లో ముందుగా పంపిణీ చేపట్టాం. ప్రస్తుతం 1,16,870 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 91,038 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ వెబ్‌జ కూడా పూర్తయ్యింది. కర్నూలు జిల్లాలోని 13 గ్రామాల్లో 8,347 మందికి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. కలుగట్ల గ్రామంలో 1,178 కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసుకుంటున్నాం. ఇప్పటివరకూ 37 లక్షల 40 వేల పట్టాదారు పాస్ పుస్తకాలు సిద్ధమయ్యాయి. ఇందులో 19 లక్షలు లక్షలు ఇప్పటికే పంపిణీ చేయగా..18 లక్షల 40 వేలు ఏప్రిల్ లోగా పంపిణీ చేస్తాం. ఇది కాకుండా 9,500 గ్రామాల్లో సర్వే చేయాలి. అవి చేస్తే 60 లక్షల మందికి కొత్తగా పాస్ పుస్తకాలు ఇచ్చే అవకాశం వస్తుంది. 2027 డిసెంబర్ నాటికి ప్రతి ఒక్కరికీ పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జాయింట్ ఎల్పీఎంల విషయంలో వివాదాలు పరిష్కరించుకోవాలని" ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

**సీమలో ప్రాజెక్టులు టీడీపీ ఘనతే :** "రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల ఘనత టీడీపీదే. హంద్రీనీవా, గాలేరు–నగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులు రావడానికి నాడు తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణం. తెలుగుగంగ సీమను సస్యశ్యామలం చేయడంతో పాటు చెన్నై దాహార్తి తీరుస్తోంది. నదుల అనుసంధానం చేసి సీమను సస్యశ్యామలం చేస్తాము. అనంతపురం జిల్లాలో నీటి సంరక్షణకు మేము తీసుకున్న చర్యలతో ప్రధాని మోదీ మన్ కీ బాత్ లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేస్తున్నాం. దేశంలో ఎక్కువ పండ్లు పండేది రాయలసీమలోనే. రాష్ట్రంలో 400 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తి అయితే అందులో 220 లక్షల మెట్రిక్ టన్నులు సీమ నుంచే వస్తున్నాయి. రాబోయే రోజుల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వంలో 8 సార్లు చార్జీలు పెంచారు. రూ. 32 వేల కోట్ల మేర విద్యుత్ భారాన్ని మోపారు. రూ. 1.20 లక్షల కోట్ల అప్పు చేశారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్ లో కరెంటు చార్జీలు పెంచబోదని హామీ ఇస్తున్నాను. నేనూ రాయలసీమలోనే పుట్టాను. ఎన్టీఆర్ కూడా సీమ ముద్దు బిడ్డే. మూడేళ్లలో కడప స్టీల్ ప్లాంట్ పనులు పూర్తి చేసే బాధ్యత నాది. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు పెడుతున్నాం. సీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**సాగునీటి రంగానికి మా మొదటి ప్రాధాన్యత:** "2014–19 మధ్య సాగునీటి రంగానికి రూ. 68 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు పోలవరం ప్రాజెక్టు పాలిట శనిలా దాపురించారు. అసమర్థత, నిర్లక్ష్యంతో రూ. 440 కోట్ల విలువైన డయాఫ్రాం వాల్ దెబ్బతింది. దీని కోసం అదనంగా రూ. 1000 కోట్లు ఖర్చయింది. సమయం కూడా వృథా అయ్యింది. 2027లో పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తాం. పట్టి సీమ ద్వారా కృష్ణాడెల్టాకు గోదావరి నీరిచ్చి, శ్రీశైలం నీటిని సీమకు మళ్లించాం. పదేళ్లుగా సీమలో కరువు లేకపోవటానికి మా దూరదృష్టే కారణం. నీరుంది కాబట్టే కియాలాంటి పరిశ్రమలు వచ్చాయి. మచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులు ఉంచుకుని రాయలసీమ లిఫ్ట్ పేరుతో నాటకాలు ఆడారు. కర్నూలు జిల్లాకు నీరిచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రాజోలి బండ, గురు రాఘవేంద్ర, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. తుంగభద్ర డ్యామ్ నుంచి వచ్చే నీరు కర్నూలు జిల్లా ఉపయోగించుకుంటే నీటి సమస్య చాలా వరకూ తీరుతుంది. ఎమ్మిగనూరులో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది వస్తే 2 వేల మంది చేనేతలకు ఉపాధి లభిస్తుంది. గాజుల దిన్నె పూర్తి చేస్తాం. రూ. 138 కోట్లతో ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అంగీకరించింది. ఎమ్మిగనూరు, ఆదోని మీదుగా రైల్వే లైన్లపై దృష్టి పెడతాం. సీమలో 120 ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే గత పాలకులు అన్నిటినీ రద్దు చేశారని" ముఖ్యమంత్రి తెలిపారు.

**శ్రీవారి లడ్డూ తయారీలో రసాయనాలు :** "అత్యంత పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని వాడారు. నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు ఇచ్చిన నివేదికతో మేం మాట్లాడుతుంటే.. సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని చెప్పుకుంటున్నారు. రసాయనాలు కలిసినట్టు నివేదికలో ఉందని వాళ్ల బాబాయ్ కూడా మాట్లాడుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీటీడీ నుంచే ప్రక్షాళన మొదలుపెట్టాం. గత పాలకుల హయాంలో తయారు చేసిన లడ్డూకి ఇప్పటి లడ్డూ ప్రసాదానికి నాణ్యతలో ఎంతో వ్యత్యాసం ఉంది. శ్రీశైలంలోనూ రసాయనాలు వాడి ప్రసాదం కల్తీ చేశారు. తప్పు చేసి నన్ను క్షమాపణ చెప్పమంటున్నారు. పరామర్శల పేరుతో గుంటూరు వెళ్లేందుకు 6 గంటలు రోడ్డు బ్లాక్ చేసి మరే వాహనాలు వెళ్లకుండా ఇబ్బందులు పెట్టారు. గతంలో కాన్వాయ్ కింద సింగయ్య అనే వ్యక్తిని తొక్కించి చంపారు. బంగారుపాళ్యంలో మామిడి కాయలను కింద పడేసి బల ప్రదర్శనకు దిగారు. బలప్రదర్శన ఎన్నికల సమయంలో చేయాలి. ఇలాంటి వారిని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోను. శాంతిభద్రతల నిర్వహణలో కఠినంగా ఉంటాను. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేయటంతో పాటు ప్రతీ రైతునూ ఆదుకుంటాం. ఉల్లికి రేటు లేకపోతే హెక్టారుకు రూ. 50 వేల చొప్పున చెల్లించాం. మామిడి, కోకో పోగాకు లాంటి పంటలకూ సబ్సీడీ ఇచ్చి ఆదుకున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బోధనాసుపత్రుల్లో హెర్బల్ గార్డెన్స్

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక స్పెషాలిటీ ఆసుపత్రు ల్లో పూల, ఔషధ మొక్కలతో కూడిన తోటలను ఏర్పాటచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. డీఎంఈ పరిధిలో ఉన్న అన్ని బోధనాసుపత్రులు, విశాఖలోని విమ్స్, ఈఎన్టి, తిరుపతిలోని మెటర్నటీ ఆసుపత్రి, పలాసలోని కిడ్నీ రీసెర్చి ఇన్స్టిట్యూటు, ఇతర ప్రత్యేక ఆసుపత్రుల్లో ఔషధ మొక్కల తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ కూడా ఈ తోటల ఏర్పాటులో భాగస్వామ్యం కానుంది.

**తులసి, ఆమ్లా, ఇతర ఔషధ మొక్కలు! :** అసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సలాల లభ్యత అనుసరించి తులసి, ఆమ్లా, బిల్వపత్ర, మునగ, ఆశ్వగంధ, రోస్మేరి, రణపాల, కలబంధ (ఆలోవెరా), అశోక, పసుపు, బ్రహ్మి వంటి ఔషధ మొక్కలను నాటతారు కనిష్ఠంగా 15 నుంచి 40 రకాల మొక్కలను తోటల్లో పెంచేందుకు వీలుంది కనీసం అర ఎకరా వరకు స్థలం అందుబాటులో ఉంటే దానిని తోటగా తీర్చిదిద్దతారు. వీటిల్లో రోగులు నడిచేందుకు వాకింగ్ ట్రాకింగులను ఏర్పాటుచేస్తారు. ఇన్పషంట్లుగా ఉన్న వారితో ఉండే సహాయకులు కాసేపు ఈ తోటల్లో సేదదీరే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. వైద్య విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కూడా ఈ తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ తెలిపారు ఈ తోటల ఏర్పాటుకు దాతల నుంచి ఆర్థిక సహకారం కూడా తీసుకోనున్నారు. ఇటీవల జరిగిన డిపార్ట్మెంట్ రివ్యూ లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఔషధ మొక్కల తోటల ఏర్పాటు పై ఆదేశాలు ఇచ్చారు.



# దేవుని అడ్డం పెట్టుకుని రూ.250 కోట్లు దోచేశారు

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లు. దేవుడుని అడ్డం పెట్టుకుని రూ. 250 కోట్లు దోచేశారు. నేడు క్లీన్ చిట్ వచ్చిందంటూ టీం 11 తప్పుడు ప్రచారం. టీం 11 దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన బూత్ మేనేజ్ మెంట్ వర్క్ షాప్ లో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులు పార్టీకి దూరమవుతారు. ఇది జరగకూడదు. పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు అని మనం జీవితాంతం గుర్తుపెట్టుకోవాలి. నాయకులు ఎంత ఎదిగినా, ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా చివరకు వచ్చేది మన దేవాలయం టీడీపీ ఆఫీసుకే అని చంద్రబాబు గారు చెప్పారు. పార్టీని మనం బలోపేతం చేసుకోవాలి. పార్టీ కోసం మనం అహర్నిశలు కష్టపడాలి. సమాజంలో మనకు గౌరవం దక్కుతోందన్నా, ప్రభుత్వంలో గౌరవం దక్కుతోందన్నా అందుకు కారణం మన పార్టీ అని గుర్తుంచుకోవాలి. టీడీపీకి బూత్ అనేది గుండెలాంటిది. 2019 ఎన్నికల దగ్గర నుంచి బూత్ లెవల్ లో మన పనితీరు ఎలా ఉంది అనేది చూడాలి. వేవ్ వచ్చినా కొన్ని కారణాల వల్ల కొన్ని బూత్ లలో గెలవడం లేదు. దానికి కారణాలు అన్వేషించాల్సిన అవసరం ఉంది.

**బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్ నిర్మాణం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం :** గ్రామస్థాయి నుంచి కాదు.. బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్ నిర్మాణం చేసుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది. బూత్ స్థాయిలో బలంగా ఉంటేనే టీడీపీ బలంగా ఉంటుంది. సీనియర్లను, జూనియర్లను సమానంగా గౌరవిస్తా. పనిచేసే వారిని ప్రోత్సహిస్తా. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా.. మనం పనిచేసిన రోజే పార్టీ బలోపేతం అవుతుంది. టీడీపీకి కోటి మంది సభ్యులు ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పనిచేసే వారిని గుర్తిస్తాం. బూత్ స్థాయి నుంచి సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటే పార్టీ బాగుంటుంది అనేందుకు మంగళగిరి, గాజువాక నియోజకవర్గాలు ఓ ఉదాహరణ. ఓ అనుభవంతో నేను మీ ముందు ఉన్నా. 1985 తర్వాత మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరలేదు. ఛాలెంజ్ గా తీసుకున్నా. కానీ 2019లో 5,300 ఓట్ల తేడాతో నేను ఓడిపోయాను. ఓడిపోయిన రోజు నాకు బాధ కలిగింది. ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఓడిపోయిన చోటనే కష్టపడి పనిచేసి టీడీపీ జెండా ఎగురవేయాలని సంకల్పించా. కార్యకర్తలతో సమావేశం పెట్టుకున్నాం. బూత్ ల వారీగా సమీక్ష చేశాం. బూత్ లెవల్ నుంచి పార్టీని ఎలా బలోపేతం చేయాలని మేమంతా చర్చించాం. ఆ చర్చ



తర్వాత మేం అనుకున్న నిర్ణయాలను తూచా తప్పకుండా నాలుగేళ్లు అమలుచేశాం.

**బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేయాలి :** చాలా మంది రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయాలని చెప్పారు. సంస్థాగత నిర్మాణాన్ని నమ్ముకున్నాను. సంస్థాగత నిర్మాణం బలంగా ఉంటే విజయం సాధిస్తామని గట్టిగా నమ్మాను. గెలిచి చూపిస్తానని ఆనాడే చెప్పా. ఐదు జోన్లలో 4,772 బూత్ లను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు 903 మంది సీనియర్ నాయకులను నియమించి కార్యాచరణ ఇవ్వడం జరిగింది. మీరంతా బూత్ కు వెళ్లి పరిస్థితులను తెలుసుకోవాలి. కనీసం బూత్ కు ఒక్కరోజు కేటాయించాలి. అక్కడ జరుగుతున్న విషయాలు తెలుసుకోవాలి. ఆ బూత్ లో పార్టీని ఎలా బలోపేతం చేయాలో చర్చించి పార్టీకి నివేదించాలి. గతం మాదిరిగా కాకుండా పార్టీకి ఏ ఫీడ్ బ్యాక్ ఇచ్చినా సీరియస్ గా తీసుకుంటున్నాం. అందువల్లే వర్క్ షాప్ ఏర్పాటుచేయడం జరిగింది. మీ రాజకీయ భవిష్యత్ ఈ బూత్ కు ముడిపడి ఉంది. కష్టపడి పనిచేయాలి. ఐదేళ్లు కష్టపడి ఫలితాలు చూపించారు కనుకనే ఇక్కడున్న వారికి పార్టీ నేరుగా పదవులు ఇచ్చింది. రాబోయే రోజుల్లో బూత్ పెర్ఫార్మెన్స్ తోనే బేరీజు వేస్తాం. ఇది మీ బాధ్యత. నాయకులతో సమన్వయం చేసుకోవాలి.

**పసుపు జెండా కోసం ప్రాణాలను త్యాగం చేసిన కార్యకర్తలు టీడీపీ సొంతం :** దేశంలో ఎన్నో ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ సంస్థాగత నిర్మాణంలో తెలుగుదేశం పార్టీ ఉన్నంత బలంగా మరే పార్టీ లేదు. నమ్ముకున్న పసుపు జెండా కోసం ప్రాణాలనే త్యాగం చేసిన కార్యకర్తలు ఒక్క టీడీపీకే సొంతం. ఏ పార్టీకి లేని కార్యకర్తలు టీడీపీకి ఉన్నారు. అంజిరెడ్డి తాత, మంజుల, చెన్నుపాటి గాంధీ, తోట చంద్రయ్యలే నాకు స్ఫూర్తి. అందరం కష్టపడి పనిచేద్దాం. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. రూ. 2కే కిలోబియ్యం, రైతులకు రూ. 50కే హార్స్ పవర్ విద్యుత్, జనతా వస్త్రాల పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు.

**టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లు :** తెలుగుజాతి గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుకుంటున్నారంటే దానికి కారణం చంద్రబాబు గారు. ఆనాడు సైబరాబాద్ నిర్మిస్తే చాలా మంది ఎగతాళి చేశారు. నేడు కోట్లాది మందికి ఐటీ అన్నం పెట్టింది. మన రాష్ట్రంలో టీం 11 ఉంది. అర్థమైందా రాజా? టీం 11 కల్తీ మద్యానికి, కల్తీ నెయ్యికి, బాబాయి హత్యకు బ్రాండ్ అంబాసిడర్లు. కల్తీ నెయ్యిలో క్లీన్ చిట్ వచ్చిందని టీం 11 కెప్టెన్ చెబుతున్నారు. ఈ మహానుభావుడు ఏం చదివాడో నాకు అర్థం కాలేదు. చార్జిషీట్ ఇంగ్లీష్ లో ఉంది. అసలు ఆయనకు ఇంగ్లీష్ వచ్చా? దేవుడుని అడ్డం పెట్టుకుని రూ. 250 కోట్లు దోచేశారు. రూ. 250 కోట్ల అవినీతికి పాల్పడి నేడు క్లీన్ చిట్ వచ్చిందని చెబుతున్నారు. టీం 11 దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపై ఉంది. 2019లో బాబాయి వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని దుష్ప్రచారం చేశారు. అది గుండెపోటు కాదు.. గొడ్డలిపోటు అని తర్వాత తెలిసింది. వారే చంపి చంద్రబాబు గారిపై నెపం వేశారు. వివేకానందరెడ్డిని అవినాష్ రెడ్డి చంపాడని జగన్ రెడ్డికి తెలుసు. అయినా దుష్ప్రచారం చేశారు. వైసీపీ దుష్ప్రచారాన్ని సరైన సమయంలో తిప్పికొట్టకపోవడంతో నష్టపోయాం.

**దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో ఏపీకి 25శాతం వస్తున్నాయి :** సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు రూ. 4వేలు, వికలాంగులకు రూ. 6వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ. 15వేలు చెల్లిస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, దీపం పథకాలు అమలు చేస్తున్నాం. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాం. 150 రోజుల్లోనే 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 6వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించాం. ఇవన్నీ ప్రజలకు వివరించాలి. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో ఏపీకి 25శాతం వస్తున్నాయి. అహర్నిశలు కష్టపడుతున్నాం. ఎంత పని ఒత్తిడి ఉన్నా వారంలో ఒక రోజు పార్టీ కేంద్ర కార్యాలయానికి కేటాయించాం. కార్యకర్తలను కలుస్తున్నాం. వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాం. ప్రతి రోజు ఒక మంత్రి వస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేస్తున్నారు.

**విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ది :** ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ఢిల్లీలో నరేంద్ర మోదీ గారు, ఏపీలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పథాన సాగుతున్నాం. విశాఖ ఉక్కును కాపాడాం. ఈ రోజు విశాఖ ఉక్కును లాభాల్లోకి తీసుకువచ్చిన ఘనత డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ది. ఈ అంశంలో వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. విశాఖ రైల్వే జోన్ సాధించుకున్నాం. అమరావతి, పోలవరం పనులు కొనసాగుతున్నాయి. కర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తాం. ఇచ్చిన హామీలు పద్ధతి ప్రకారం నిలబెట్టుకుంటున్నాం. అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు ఇందుకు ఉదాహరణ. 2019 నుంచి 2024 వరకు మనం ఎంతో నష్టపోయాం. పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేశారు. తగ్గేదే లేదని మనం ముందుకు వెళ్లాం. అందరం కష్టపడి ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకున్నాం. చిన్నచిన్న సమస్యలు ఉన్నా మనం అనుకున్న దాని కోసం పోరాడాలి, నాయకులతో చర్చించాలి. పార్టీ నేతలు అలక వీడాలి. అలిగితే నష్టపోయేది మనం, మన పార్టీ, మన రాష్ట్రం. కూటమిలో విడాకులు ఉండవు, మిస్ ఫైర్ లు ఉండవు, క్రాస్ ఫైర్ లు ఉండవు. సమస్యలు ఏవైనా ఉంటే మూడు పార్టీలు కూర్చొని చర్చించుకుంటాయి. ఇది గ్రామస్థాయి వరకు పాటించాలి. కనీసం 15 ఏళ్లు కలిసికట్టుగా ముందుకు వెళ్తేనే అభివృద్ధి సాధ్యమని పవనన్న చెప్పారు. మన మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి మాట్లాడుతూ.. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు, స్వర్ణ మండల, స్వర్ణ జిల్లాల ద్వారా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' సాధించడమే లక్ష్యమని అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం మేరకు 'విజన్ 2047'లో భాగంగా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్'ను సాధించడమే లక్ష్యమన్నారు. జిల్లా, మండల స్థాయి అర్బన్ లెవల్ స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులందరులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో వేర్వేరు క్యాడర్‌లలో ఉన్న అధికారులందరికీ నేడు ఇప్పుడు పదోన్నతులు లభించాయని ఆయన పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది ప్రతి పౌరునికి సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు.

గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖల పర్యవేక్షణ వేర్వేరుగా ఉండేదని, అయితే మెరుగైన పర్యవేక్షణ కోసం నేడు వాటిని సమన్వయం చేస్తూ స్వర్ణ గ్రామ సచివాలయాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న సుమారు 20,000 పోస్టులతో కలిపి మొత్తం 1,40,000 మంది సిబ్బంది స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ శాఖలో పనిచేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఏ, బి, సి కేటగిరీలుగా సిబ్బందిని విభజించి (రేషనలైజేషన్)




సేవలను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను బలోపేతం చేస్తూ 10 మంది అదనపు సిబ్బందిని కేటాయించామన్నారు. మండల స్థాయిలో అధికారులకు సహాయంగా ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ ను నియమించామన్నారు. విశాఖపట్నం వంటి మహానగరాల్లో 18 మంది, ఇతర నగర పంచాయతీలలో జనాభాను బట్టి 4 నుండి 10 మంది వం-కు సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. క్లస్టర్ ఆధారిత సేవలను అందిస్తూ, సంబంధిత విభాగాలతో (లైన్ డిపార్ట్‌మెంట్స్) సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి గుర్తుచేశారు.

స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా, మండల , పట్టణ స్థాయిల్లో 'స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు' శాఖలో పదోన్నతి పొందిన అధికారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని ప్రజలకు గౌరవ, వేగవంతమైన సేవలను అందించాలన్నారు. స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు కేవలం పేరు మార్పు మాత్రమే కాదని 2047 నాటికి మన దేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే ప్రక్రియలో భాగంగా ఈ మార్పు జరిగిందన్నారు. ప్రతి గ్రామం, వార్డులో మెరుగైన మౌలిక సదుపాయాలు (రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీ వ్యవస్థ) కల్పించి, ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే దీని ప్రధాన ఉద్దేశం అన్నారు. సాంకేతికత వేగంగా మారుతోందని, ప్రభుత్వం ఇప్పటికే చాట్ బాట్లను (జష్ట్రఫ్ఎశీం) ఉపయోగించి ఉత్తర్వులు జారీ చేసే స్థాయికి చేరిందని ఆయన గుర్తు చేశారు. అధికారులు ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకమైన ప్రవర్తన కలిగి, పనులను నిర్ణీత సమయంలో, నిబంధనల ప్రకారం గౌరవంగా పూర్తి చేయాలన్నారు. బయోమెట్రిక్ వంటి పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం లేని విధంగా, ప్రతి అధికారి తమ బాధ్యతను గుర్తించి సక్రమంగా పని చేయాలన్నారు. ఒక సామాన్య పౌరుడు ఆఫీసుకి వస్తే మనం ఎలా స్పందించాలో ఆలోచించి, సేవలందించాలని కార్యదర్శి కాటమనేని భాస్కర్ కోరారు.

స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ శాఖ డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో 'గ్రామ వార్డు సచివాలయ శాఖ'గా ఉన్న పేరును నేడు 'స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు' శాఖగా మార్చామన్నారు. సచివాలయాల పర్యవేక్షణ కోసం మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులతో కూడిన మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు.

పనిభారాన్ని క్రమబద్ధీకరించడానికి జనాభా ఆధారంగా కార్యాలయాలను మూడు కేటగిరీలుగా విభజించామన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ సెక్రటరీల పదోన్నతులపై ఉన్న సందిగ్ధతను తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒక 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్' కమిటీని వేశామన్నారు. రాబోయే రెండు నెలల్లో దీనిపై స్పష్టమైన నిబంధనలు వస్తాయని డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ అన్నారు.

కార్యక్రమంలో ఏడీసీ సీబీ అండ్ హెచ్‌ఆర్ జీవీ సూర్యనారాయణ, ఏడీసీ డీఎస్ ఎస్. గౌతమి, చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ సీహెచ్. చిన్నారావు, ప్రణాళిక శాఖ అధికారి అనంత శంకర్, తదితర అధికారులు ఓరియెంటేషన్ పై ఉద్యోగులకు, అధికారులకు అవగాహన కల్పించారు.

## రూ. 97 కోట్లతో 'అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు'



(మొదటి పేజీ తరువాయి)

పుష్కరాల నిర్వహణలో పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, త్వరలోనే జిల్లా అధికారులతో పాటు హెచ్ వోడీలను కూడా భాగస్వామ్యం చేస్తూ పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధం చేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. పుష్కరాలపై సమగ్ర పర్యవేక్షణ తప్పనిసరి అని సూచించారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టెంపుల్ సర్క్యూట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నవ జనార్ధన పారిజాతం (వైష్ణవ ఆలయాలు), ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలను అనుసంధానిస్తూ పర్యాటక ప్యాకేజీలు రూపొందిస్తామన్నారు. పాపికొండల పర్యాటకాన్ని కూడా ఇందులో భాగం చేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

కోట్లాది మంది భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కుంభమేళా తరహాలో అత్యున్నత ప్రమాణాలతో 'టెంట్ సిటీలు' ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'హోమ్ స్టే' పాలసీని ప్రోత్సహిస్తున్నామని, ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లోని మండువా లోగిళ్లకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎక్కడ స్నానం చేసినా పుణ్యఫలం లభిస్తుందని, ఒకే ఘాట్ వద్ద రద్దీ పెరగకుండా ప్రముఖ ప్రవచన కర్తలు చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావుల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ శాస్కిస్కీమ్ క్రింద రూ. 97 కోట్లతో చేపట్టిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనులు పుష్కరాల నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇందులో భాగంగా పుష్కర్ ఘాట్ అభివృద్ధి, హేవలాక్ వంతెన ఆధునికీకరణ, బ్రిడ్జిలంక వద్ద వాటర్ స్పోర్ట్స్, కడియంలో ఎక్స్ పీరియన్స్ సెంటర్, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయ అభివృద్ధి, శెట్టిపేట వద్ద బోట్ షికారు పనులు వేగవంతం చేస్తామన్నారు. రోడ్ల కనెక్టివిటీ పెంపు కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు రూ. 1000 కోట్లకు పైగా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతల విషయంలో ఎస్పీ నరసింహ కిషోర్ కు తగిన సూచనలు చేస్తూ, పార్కింగ్ స్థలాల ఎంపికపై దృష్టి సారించాలన్నారు.

సమీక్షా సమావేశంలో ఎమెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే లు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, వేగుళ్ళ జోగేశ్వర రావు, బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఆర్డీవోలు రాజమహేంద్రవరం కే. భాస్కర్ రెడ్డి (ఇంచార్జి) , కొవ్వూరు రాణి సుస్మిత, కార్పొరేషన్ డైరెక్టర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతర కృషి



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకుల వినతి

**నిమ్మాడ(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు (యూటీఎఫ్) నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని కోరారు. ఈ సందర్భంగా నిమ్మాడలోని ఆయన కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. త్వరలో ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తగిన నిధులు కేటాయించాలని వారు కోరారు. అదేవిధంగా వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత బకాయిలను చెల్లించాలని వినతిపత్రంలో వారు స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, గిరిధర్, తదితరలు పాల్గొన్నారు.

**ప్రజల నుంచి వినతులు స్వీకరణ:** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి తక్షణమే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, మంత్రి సావధానంగా విని సానుకూలంగా స్పందించారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. "ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, వాటిని క్షేత్రస్థాయిలో రిష్కరించడమే మా లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది" అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పి.హెచ్.సిలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు

శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పై పబ్లిక్ పెర్సెప్షన్ , ఎంసీహెచ్ సేవల నమోదు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్యక్రమాలపై యుపీహెచ్సీ, పీహెచ్సీల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో పబ్లిక్ పెర్సెప్షన్ లో పాజిటివ్ ఫీడ్ బ్యాక్ మరింతగా మెరుగుపర్చాలన్నారు. ప్రజలకు అవసరమైన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. యుపీహెచ్సీ, పీహెచ్సీల పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రోగ్రాం ఆఫీసర్, ప్రత్యేక అధికారులను నియమించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు.

## విజ్ఞాన్ మహోత్సవ్ వేదికపై "చైనా పీస్' సినిమా యూనిట్ సందడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి 19వ ఎడిషన్ "విజ్ఞాన్ మహోత్సవ్–2కే26" రెండో రోజు కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా సాగాయి. ఇప్పటికే క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడుతున్న మహోత్సవ్ వేదికపై "చైనా పీస్" సినిమా యూనిట్ సందడి చేయడంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హీరో నిహాల్ కొదాటి, నటి శిరీష, దర్శకుడు అక్కి విశ్వనాథ రెడ్డి ఈ మహోత్సవానికి హాజరై విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేసి వేదికను ఉర్రూతలూగించారు.



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హీరో నిహాల్ కొదాటి మాట్లాడుతూ, "చైనా పీస్" సినిమా మార్చి 6న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి స్పై థ్రిల్లర్‌గా, దేశభక్తి, రహస్య మిషన్లు, పొలిటికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కించామని చెప్పారు. ఇందులో భావోద్వేగాలు, ఉత్కంఠ, యాక్షన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే దేశభక్తి థీమ్‌తో విడుదలైన "భగ భగ" పాటకు మంచి స్పందన వస్తోందని, అలాగే "ఇదేంటో జేమ్స్ బాండ్" పాట కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిందన్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ లాంటి విద్యార్థుల వేదికపై సినిమా ప్రమోషన్ చేయడం ఎంతో ఆనందంగా ఉందని, విద్యార్థుల ఉత్సాహమే తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు. విద్యార్థులందరూ ఈ సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు.

ఈ సందర్భంగా నటి శిరీష మాట్లాడుతూ, "చైనా పీస్" సినిమాలో తన పాత్ర కథలో కీలక మలుపులు తిప్పే విధంగా ఉంటుందని, ప్రేక్షకులను ఆకట్టుకునే బలమైన పాత్రగా ఇది నిలుస్తుందని తెలిపారు. ఈ సినిమాలో పనిచేసిన అనుభవం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, విజ్ఞాన్ మహోత్సవ్ లాంటి ఉత్సాహభరిత వేదికపై విద్యార్థులతో కలవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలతో నిండిన ఈ మహోత్సవ్ వాతావరణం యువతలో సృజనాత్మకతను మరింత పెంచుతుందని పేర్కొన్నారు.

దర్శకుడు అక్కి విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ, "చైనా పీస్" మూవీ క్లాసిక్ స్పై డ్రామాతో పాటు థ్రిల్, యాక్షన్, హ్యూమర్ అన్నీ మేళవింపుతో రూపొందించామని చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించిందని, సీరియస్ థ్రిల్‌తో పాటు ప్రేక్షకులను నవ్వించే కొన్ని కామెడీ ఎలిమెంట్స్ కూడా ఉంటాయని తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవ్ లాంటి జాతీయస్థాయి వేదికపై సినిమా గురించి మాట్లాడే అవకాశం రావడం తమకు గర్వకారణమని అన్నారు.

ఈ చిత్రాన్ని మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై నిర్మించారని, సినిమాకు అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వం వహించగా, సంగీత దర్శకుడిగా ఆర్. కార్తీక్, ఎడిటర్‌గా మార్తాండ్ కే. వెంకటేష్, సినిమాటోగ్రాఫర్ (డీవోపీ)గా ఆర్. సురేష్ పనిచేశారని తెలిపారు.

సినిమా యూనిట్ సభ్యులు విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం "చైనా పీస్" సినిమా యూనిట్ సభ్యులు విద్యార్థులతో కలిసి సెల్ఫీలు దిగడంతో కార్యక్రమం మరింత ఉత్సాహంగా మారింది. ఇప్పటికే క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా సాగుతున్న విజ్ఞాన్ మహోత్సవ్‌కు సినిమా బృందం చేసిన ఈ సందడి మరింత రంగు అద్దింది. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా బీజేపీ బలానికి పునాది

- **ఎస్సీ ఉపకులాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలాన్ని గ్రామ స్థాయి వరకు విస్తరించడంలో మోర్చాల పాత్ర కీలకమని, ముఖ్యంగా ఎస్సీ ఉపకులాలపై ప్రత్యేక దృష్టితో సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. విజయవాడలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో విశాఖపట్నం నుంచి వెబ్ఎక్స్ ద్వారా పాల్గొన్న మాధవ్, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

ఎస్సీ సమాజంలో ఉన్న విభిన్న ఉపకులాల సమస్యలు, ఆశయాలు, ఆలోచనలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సామాజిక న్యాయం, సమానత్వం అనే బీజేపీ సిద్ధాంతం క్షేత్రస్థాయిలో అమలయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. "ఎస్సీ ఉపకులాల సమస్యలు వేరువేరు. వాటిని అర్థం చేసుకుని పరిష్కార దిశగా ముందుకు వెళ్లడమే బీజేపీ లక్ష్యం" అని పేర్కొన్నారు.

గుర్రం జాషువా జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన తరహాలోనే డా. బీఆర్ అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను మరింత విస్తృతంగా, అర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలు కేవలం వేడుకలుగా కాకుండా సామాజిక అవగాహన, రాజకీయ చైతన్యం, యువతలో స్ఫూర్తి నింపేలా ఉండాలని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా అవగాహన కల్పించడమే మోర్చాల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ఉజ్వల, ఆయుష్మాన్ భారత్,



పీఎం ఆవాస్ యోజన, ముద్రా రుణాలు, స్టాండప్ ఇండియా వంటి పథకాల ద్వారా దళితులు సాధికారత దిశగా ముందుకెళ్తున్నారని గుర్తు చేశారు.

ఈ సమావేశంలో వెబ్ఎక్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలపరిచేందుకు అవసరమైన సంస్థాగత నిర్మాణంపై వివరించారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు పూర్తి స్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, ప్రతి కార్యకర్తకు స్పష్టమైన బాధ్యతలు కేటాయించాలని సూచించారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర ఇంచార్జి మట్టా ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ––మోర్చా కార్యక్రమాలు విడివిడిగా కాకుండా మిళితంగా సాగాలని చెప్పారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీల ఏర్పాటు, కార్యకర్తలకు పనివిభజన, ప్రభుత్వ పథకాలపై అవగాహన, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు ప్రధాన అజెండాగా ఉండాలని తెలిపారు. బీజేపీ కార్యకర్త సమాజంలో ఆదర్శ వ్యక్తిగా గుర్తింపు పొందాలని, ప్రతి కార్యకర్తకు రాజకీయ అవగాహన, సామాజిక బాధ్యత, పార్టీ సిద్ధాంతంపై స్పష్టత ఉండాలని అన్నారు.

సోషల్ మీడియా వేదికగా బీజేపీ చేస్తున్న కార్యకలాపాలను కూడా ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర స్థాయిలో సోషల్ మీడియా యాక్టివిటీ ర్యాంకుల్లో టిడిపి, వైసీపీ తర్వాత బీజేపీ మూడో స్థానంలో నిలిచిందని, అందులో ఎస్సీ మోర్చా పాత్ర కీలకమని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయాలని సూచించారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ, పార్టీ కార్యక్రమాలను వేగంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన ఎస్సీ మోర్చా కమిటీలను బలంగా ఏర్పాటు చేసి, బీజేపీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ పాలనలో దళితులకు యువతకు ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధికి రుణాలు, గ్యారెంటీ లేకుండా లభిస్తున్నాయని వివరించారు. దళిత నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బసవరాజు, ఉదయ్, రాకేష్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇంచార్జి కిలారు దిలీప్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల శాంత కుమార్, కట్టా పద్మ, వివిధ జిల్లాల ఎస్సీ మోర్చా అధ్యక్షులు, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు.

## జగన్ మోహన్ రెడ్డి చేయాల్సింది పరామర్శలు కాదు ప్రాయశ్చిత్త దీక్షలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పర్యటనలపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ చేస్తున్నవి పరామర్శ యాత్రలు కావని, గత ఐదేళ్లలో చేసిన అరాచకాలకు 'ప్రాయశ్చిత్త దీక్షలు' చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి తన హయాంలో చేసిన తప్పులు, అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ యాత్రలు చేస్తున్నారని మంత్రి దుర్గేష్ విమర్శించారు. ఇది పక్కా డైవర్షన్ పాలిటిక్స్ అని స్పష్టం చేశారు. రోడ్లు క్లియర్ గా ఉన్నప్పటికీ, కేవలం 20 కిలోమీటర్ల దూరాన్ని 7 గంటల పాటు నెమ్మదిగా ప్రయాణించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాకుండా, కృత్రిమమైన హడావుడి సృష్టించే ప్రయత్నమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అడ్డగోలుగా, అసభ్యకరంగా మాట్లాడిన వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాల్సింది పోయి, వారికే పరామర్శలు చేస్తూ జగన్ తప్పుడు సంకేతాలు ఇస్తున్నారని మంత్రి దుర్గేష్ ఆరోపించారు. ఇటువంటి చర్యల ద్వారా వైసీపీ నాయకత్వం సమాజంలో అసభ్యకర భాషను, అరాచక సంస్కృతిని ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. పరామర్శల పేరుతో రాష్ట్రంలో అశాంతిని, అరాచకాలను సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. "డబ్బులు ఇచ్చి జనాలను తరలిస్తూ షో చేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎప్పుడూ దాడులను ప్రోత్సహించరు, కానీ జగన్ ఎప్పుడూ మంచిని ప్రోత్సహించరు అనేది స్పష్టమవుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీ ఎన్ని డ్రామాలు ఆడినా, ప్రజలు ఆ పార్టీని నమ్మే స్థితిలో లేరని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. "ఏం చేసినా వైసీపీ జీవితంలో మళ్ళీ అధికారంలోకి రాదు. ప్రజలు వారి పాలనలోని చీకటి రోజులను ఇంకా మర్చిపోలేదు" అని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో ఘాటుగా విమర్శించారు.

## శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్ ముందుగా విడుదల చేయాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ర్యాంప్ (రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎం.ఎస్.ఎం.ఇ ప్రోగ్రామ్) శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్‌ను ముందుగా విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి (డి.ఐ.ఇ.పి.సి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలు పక్కాగా జరగాలని, ఆసక్తిగల అభ్యర్థులు పాల్గొనుటకు అవకాశం ఉండాలని, ఆ మేరకు వివరాలు ప్రతీ ఒక్కరికి తెలియాలన్నారు. నాణ్యతతో కూడిన శిక్షణ ఉండాలని, శిక్షణ పొందిన ప్రతీ ఒక్కరూ ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్, ఆన్ లైన్ వాణిజ్యంలో శిక్షణ, వెండర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, ఔత్సాహిక పారిశ్రామిక నైపుణ్య కార్యక్రమాలు, బిజినెస్ డెవలప్మెంట్ సర్వీస్ తదితర రంగాల్లో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలులో ఆసక్తి ఉన్నవారు అనేక మంది ఉన్నారని చెప్పారు. సరస్ లో ఈ కార్యక్రమాల పట్ల అనేక మంది మహిళా సభ్యులు అడగడం జరిగిందని తెలిపారు. ముద్ర రుణాలు క్రింద చిన్న మొత్తాలు అవసరం ఉన్న వ్యక్తులు ఎక్కువ మంది ఉంటారని, వారికి ఎక్కువ అవకాశం కల్పించాలని సూచించారు. తద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు.

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ జనవరి 22వ తేదీ నుండి 862 దరఖాస్తులు సింగిల్ విండో లో అందగా 798 దరఖాస్తులకు మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు. పెట్టుబడి రాయితీ కింద రూ. 2.77 కోట్లు మంజూరు చేయడం జరిగిందని వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి. నజీనా బేగం, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, ఆర్.టి.ఓ కె.శ్రీహరి, పర్యాటక అధికారి రమ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఇన్ ఛార్జ్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గా భాయి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం పెద్దపులుగువారిపాలెం రహదారి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా చురుగ్గా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కర్లపాలెం నుండి పెద్దపులుగువారి పాలెం వరకు జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను, పనుల పురోగతిని



ఎమ్మెల్యే స్వయంగా తనిఖీ చేశారు. ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే రవాణా ఇబ్బందులు తొలగి, స్థానిక ప్రజలకు మరియు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఒక లక్ష్యం, ప్రణాళిక లేదు

**ఢిల్లీ:** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ విపక్షాల వాకౌట్ చేశాయి. మరోవైపు.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై ప్రధాని మోదీ సెటైరికల్ కామెంట్స్ చేశారు. మీరు కూర్చునే నినాదాలు చేయొచ్చు అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా.. విపక్ష పార్టీల ఎంపీలు నిరసనతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే కూడా లేచి నిలబడి నిరసనలు తెలిపారు. దీంతో, మోదీ... వయసు రీత్యా ఖర్గే కూర్చుని నిరసనలు చేపట్టొచ్చని మోదీ అన్నారు. అనంతరం, రాజ్యసభ నుంచి విపక్ష నేతలు వాకౌట్ చేశారు. ముందు నన్ను మాట్లాడనివ్వాలంటూ విపక్షాలకు ప్రధాని మోదీ సూచించారు. మరోవైపు.. రాజ్యసభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఎన్డీయే హయాంలో భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా మారనుంది. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. గతంలో భారత్‌తో ఒప్పందానికి పలు దేశాలు ముందుకు వచ్చేవి కాదు. దేశం కోసం కాంగ్రెస్ ఎప్పుడూ పనిచేయలేదు. కాంగ్రెస్‌కు ఎప్పుడూ ఒక విజన్ లేదు. ఎన్డీయే హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. మా హయాంలో అనేక సంస్కరణలు చేపట్టాం.

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో



విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి ఒక ఆలోచనా విధానంగానీ, దూరదృష్టి గానీ, ఎలాంటి ప్రణాళిక గానీ లేవని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని సమాధానం ఇచ్చారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీరుపైనా మండిపడ్డారు. తాను ప్రసంగిస్తున్న సమయంలో ఖర్గే సహా విపక్ష నేతలు నినాదాలు చేయడంతో ప్రధాని మోదీ ఈ విధంగా స్పందించారు. ప్రధాని ప్రసంగాన్ని వ్యతిరేకించిన విపక్ష సభ్యులు.. దేశంలో నియంతృత్వం నడవదంటూ నినాదాలు చేశారు. సభ్యుల నిరసన మధ్యే ప్రధాని మోదీ తన ప్రసంగం కొనసాగించారు. ఈ క్రమంలోనే విపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు లోక్‌సభలో ప్రధాని మోదీని చుట్టుముట్టేందుకు కాంగ్రెస్ సభ్యులు ప్లాన్ చేసినట్లు తెలిసిందని స్పీకర్ ఓంబిర్లా పేర్కొన్నారు. విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధాని మోదీని సభకు రావొద్దని తానే సూచించానని ఆయన చెప్పారు. కాగా లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని సమాధానం ఇవ్వకపోవడం సిగ్గుచేటని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

భారత్ తొమ్మిది దేశాల్లో ట్రేడ్ డీల్ చేసుకుంది. అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొవడానికి దేశం సిద్ధంగా ఉంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇటీవలి కాలంలో దేశం శరవేగంగా పురోభివృద్ధి సాధిస్తోంది. అన్ని వర్గాల్లో మార్పు కనిపిస్తోంది. 27 దేశాలు, ఈయూతో అనేక ఒప్పందాలు చేసుకున్నాం' అని చెప్పుకొచ్చారు.

రాష్ట్రపతిని విపక్షాలు దారుణంగా అవమానించారు. దేశ అత్యున్నత పదవిని విపక్షాలు అవమానించాయి. దేశ అత్యున్నత పదవిని, రాజ్యాంగాన్ని, ఆదివాసీలను అవమానించారు. లోక్‌సభలో విపక్షాల ప్రవర్తన నన్నెంతో బాధపెట్టింది. స్పీకర్ కుర్చీలో కూర్చున్న దళితులను విపక్షాలు అవమానించాయి. అసోం ప్రజలు ఈ అవమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేరు. కాంగ్రెస్ యువరాజు ఓ ఎంపీని ద్రోహి అన్నారు. అతనికి గర్వం తలకెక్కింది. కాంగ్రెస్ నుంచి ఎంతో మంది పార్టీని వీడారు. బిట్టు సిక్కు కావడంతో అతడిని అవమానించారు. సిక్కుల పట్ల ఎంత ద్వేషం ఉందో వారి మాటల్లో కనిపించింది అని మండిపడ్డారు.

# భారత్‌కు అమెరికా బంపరాఫర్

**ఢిల్లీ:** భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా అమెరికాతో జరిగిన ట్రేడ్ డీల్‌లో రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను నిలిపివేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతిఫలంగా అమెరికా.. భారత్‌కు విధించే ప్రతీకార పన్నును 18 శాతం తగ్గించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేయనున్నారు. అదే సమయంలో అమెరికా నుంచి భారత్ సైతం 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, సాంకేతిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రకటనపై వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సైతం స్పష్టత ఇచ్చారు. సీనియర్ అమెరికా అధికారులు వచ్చే వారం ఢిల్లీలో ఒప్పందంపై సంతకం చేయడానికి రానున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఫిబ్రవరి 3న భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం తుది రూపం దాల్చింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా భారతీయ వస్తువులపై విధిస్తున్న సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించి, భారత ఎగుమతులకు కొత్త అవకాశాలు



కలిగేందుకు దోహదం చేయనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## 20 ఏళ్ల అమ్మాయి ప్రెగ్నెన్సీ కేసులో 17 మందికి డీఎన్ఏ పరీక్ష..

# పాజిటివ్‌గా తేలిన తండ్రి శ్యాంపిల్

**ముంబై:** ముంబైలో జరిగిన ఓ గ్యాంగ్ రేప్ ఘటన .. షాకింగ్ విషయాలను బయటపెట్టింది. గ్యాంగ్‌రేప్‌కు గురైన 20 ఏళ్ల మానసిక దివ్యాంగురాలి కేసులో అనూహ్యమైన కోణం బయటపడింది. గర్భం దాల్చిన ఆ అమ్మాయితో సన్నిహితంగా ఉన్న 17 మందికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. అయితే ఆ రిపోర్టులో ఆ అమ్మాయి తండ్రే పాజిటివ్‌గా తేలినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో కఫే పరేడ్ పోలీసులు తండ్రిని అరెస్టు చేశారు. పోలీసుల ప్రకారం.. గత ఏడాది అక్టోబర్‌లో కామా అండ్ ఆల్బ్‌లెస్ ఆస్పత్రి పోలీసు స్టేషన్‌కు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 20 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు తమ ఆస్పత్రిలో ఉన్నట్లు పేర్కొన్నారు. కడుపు నొప్పితో ఉన్న ఆమెను .. అయిదు నెలల ప్రెగ్నెంట్‌గా గుర్తించారు. అయితే ఆ అమ్మాయిని అనేక మంది లైంగికంగా వాడుకున్నట్లు తెలిసింది. సరైన రీతిలో మాటలు రాకపోవడంతో.. పోలీసులు ఈ కేసులో




లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఆమెతో పరిచయం ఉన్న 16 మంది నుంచి డీఎన్ఏ శ్యాంపిళ్లను సేకరించారు. దాంట్లో తండ్రి, కుటుంబభ్యులు, పొరుగింటోళ్లు ఉన్నారు. ఆ మహిళ ప్రెగ్నెన్సీని పోలీసులు టర్మినేట్ చేశారు. ఆమె గర్భస్థ పిండం నుంచి డీఎన్ఏను సేకరించారు. కలినా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపారు. జనవరి 27వ తేదీ రిపోర్టు వచ్చింది. తండ్రి నుంచి సేకరించిన డీఎన్ఏతో బాధిత వ్యక్తి పిండం నుంచి సేకరించిన డీఎన్ఏ శ్యాంపిళ్లు మ్యాచ్ అయినట్లు గుర్తించారు. ఆ నివేదిక ఆధారంగా తండ్రిని అరెస్టు చేశారు. ఇదే కేసులో కఫే పరేడ్ మురికివాడకు చెందిన ఇద్దరు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. వారిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కానీ ఇప్పుడు డీఎన్ఏ శ్యాంపిళ్లతో తండ్రి పాత్ర తేలినట్లు పోలీసులు వెల్లడించారు. భయం వల్ల బాధితురాలు తన తండ్రి పేరు చెప్పలేదని పోలీసులు తెలిపారు. అయితే ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్ సెషన్ల సమయంలో ఆమె కొన్ని విషయాలు చెప్పిందన్నారు. తండ్రి కూడా తనను లైంగికంగా వేధించినట్లు పేర్కొందన్నారు. అనేక రకాల థెరపీలు ఇచ్చి .. బాధితురాలు మాట్లాడేటట్లు చేశామన్నారు


# భారీ ట్రాఫిక్ జామ్.. 33 గంటల తర్వాత..

**ముంబై:** మహారాష్ట్రలోని ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై 33 గంటలుగా కొనసాగుతున్న భారీ ట్రాఫిక్ జామ్ ఎట్టకేలకు గురువారం ఉదయం క్లియర్ అయ్యింది. మంగళవారం సాయంత్రం ఖండాలా ఘాట్ సెక్షన్‌లో గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడటంతో ఈ పరిస్థితి తలెత్తింది. వేల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం తెల్లవారుజామున 1:46 గంటల ప్రాంతంలో ఆదోషి టన్నెల్ సమీపంలో ప్రమాదానికి గురైన ట్యాంకర్‌ను తొలగించడంతో ముంబై వైపు వెళ్లే మార్గంలో రాకపోకలు మళ్లీ ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో అతివేగంతో వస్తున్న ప్రొపిలీన్ గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి ఘాట్ రోడ్డులో బోల్తా పడింది. అత్యంత ప్రమాదకరమైన, మండే స్వభావం గల గ్యాస్ కావడంతో భద్రతా కారణాల దృష్ట్యా



అధికారులు వెంటనే ట్రాఫిక్‌ను నిలిపివేశారు. బుధవారం రోజంతా ట్యాంకర్‌లోని గ్యాస్‌ను మరో వాహనంలోకి మార్చే ప్రక్రియ కొనసాగింది. హెవీ డ్యూటీ క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను రోడ్డుపై నుండి తొలగించిన తర్వాతే వాహనాల రాకపోకలకు లైన్ క్లియర్ అయిందని మహారాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్ఆర్‌డీసీ) అధికారులు వెల్లడించారు. సుమారు 90 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. సుమారు 20 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు, ఆహారం, తాగునీరు తదితర సదుపాయాలు లేక గంటల తరబడి వాహనాల్లోనే చిక్కుకుపోయారు. కొందరు పారిశ్రామికవేత్తలు ట్రాఫిక్ నుండి తప్పించుకునేందుకు హెలికాప్టర్లను ఆశ్రయించగా, సామాన్య ప్రయాణికులు మాత్రం ఎముకలు కొరికే చలిలో రోడ్డుపైనే కాలం గడపాల్సి వచ్చింది. ఈ భారీ ట్రాఫిక్ అంతరాయంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని కోరారు. ప్రస్తుతం ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ, ఘాట్ సెక్షన్‌లో వాహనాల రద్దీ నెమ్మదిగా సర్దుకుంటోందని హైవే పోలీసులు తెలిపారు.

## కుట్రతోనే ప్రధాని సీటును కాంగ్రెస్ ఎంపీలు చుట్టుముట్టారు



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీలు కుట్రతోనే ప్రధాని మోదీ సీటును చుట్టుముట్టారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆరోపించారు. అందుకే ఆయన భద్రత దృష్ట్యా సభకు రావద్దని ప్రధానికి సలహా ఇచ్చానని చెప్పారు. దీంతో ప్రసంగాన్ని మోదీ రద్దు చేసుకున్నారని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రధాని మోదీ లోక్‌సభలో బుధవారం ప్రసంగించాల్సి ఉన్నది. అయితే దీనికి ముందు సభలో గందరగోళం చెలరేగింది. ప్రతిపక్షాలకు చెందిన మహిళా ఎంపీలు ప్రధాని సీటు ముందు నిల్చొని నిరసన తెలిపారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ వాయిదా పడింది. కాగా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ సంఘటనపై సభలో గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంపీలు తన చైర్‌ను చుట్టుముట్టి దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఎంపీలు గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించవచ్చని తనకు ముందే సమాచారం ఉన్నట్లు తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు ప్రధానమంత్రి సీటు వద్దకు వెళ్లి ఊహించని సంఘటనకు పాల్పడవచ్చని నాకు విశ్వసనీయ సమాచారం అందింది. అలాంటి సంఘటన జరిగి ఉంటే, అది దేశ గౌరవానికి తీవ్ర నష్టం కలిగించి ఉండేది. అందుకే ప్రధానమంత్రిని పార్లమెంటుకు రావద్దని నేను కోరా' అని అన్నారు. మరోవైపు రాజకీయ విభేదాలను స్పీకర్ కార్యాలయం వరకు తీసుకురావడం ఈ సభ సంప్రదాయం కాదని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. లోక్‌సభలో బుధవారం జరిగిన సంఘటన పార్లమెంటు చరిత్రలో ఒక మాయని మచ్చ అని అన్నారు.

## బొగ్గు గనిలో పేలుడు.. 10 మంది మృత్యువాత



మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్గై ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, కనీసం 10 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. అయితే అంతకంటే ముందు బీఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దులో కంచె ఏర్పాటును అడ్డుకుంటోందని కేంద్రం, బీజేపీ నేతలు చేసిన ఆరోపణలను ఆమె కొట్టిపారేశారు. బీఎస్ఎఫ్‌తో సహా అన్ని కేంద్ర సంస్థలు, ఏజెన్సీలకు ఇప్పటికే భూమిని అందించామని తెలిపారు. దేశ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మమతా బెనర్జీ అన్నారు. కంచె విషయంలో భూమి అనేది సమస్య కానే కాదని అన్నారు. ఎంత భూమి అవసరమైతే అంత కేటాయిస్తామని, కానీ బీఎస్ఎఫ్ అధికార పరిధిపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. కంచె విషయంలో కొన్ని వాస్తవాలనే బీజేపీ ప్రజల ముందు ఉంచుతోందని ఆరోపించారు. రాష్ట్రం ఇప్పటికే ఎంత భూమిని ఇచ్చిందనే వివరాలను కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో చొరబాట్లు ముప్పుగా పరిణమించాయని, కంచె కోసం భూమి కోరుతూ కేంద్రం పలుమార్లు లేఖలు రాసినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని ప్రతిపక్ష నేత సువెందు అధికారి ఆరోపించారు. అయితే చొరబాట్లపై సాక్ష్యాలను చూపించాలని మమతా బెనర్జీ సవాల్ చేశారు. కంచె కోసం ఇప్పటికే కేటాయించిన భూమిలో ముందుగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

## అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన ఉంటుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రెండు దేశాల మధ్య జరిగిన అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఇది మొదటి అంకమని ఆయన అన్నారు. రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన వెలువడుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని పీయూష్ గోయల్ అన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించి మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందని వెల్లడించారు. ఉమ్మడి ప్రకటన వెలువడిన అనంతరం, భారతదేశంపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా ఒక కార్యనిర్వాహక ఉత్తర్వును విడుదల చేస్తుంది. మూడు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడడం తెలిసిందే. అనంతరం ట్రంప్ "భారతదేశానికి చెందిన ఉత్పత్తులపై ఇక నుంచి అమెరికాలో 18 శాతం సుంకాలు మాత్రమే ఉంటాయి" అని పోస్టు చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపినట్టు ప్రకటించారు.

# 'క్వాంటమ్ వ్యాలీ' భూమి పూజకు పటిష్ఠ బందోబస్తు



○ ఉద్దండరాయుని పాలెం వద్ద విస్తృత భద్రతా ఏర్పాట్లు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉద్దండరాయుని పాలెం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న 'క్వాంటమ్ వ్యాలీ' భూమి పూజ కార్యక్రమానికి గుంటూరు జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేడు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమం శాంతియుతంగా, సురక్షితంగా సాగేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. వీవీఐపీ, వీఐపీ సందర్శనల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

భూమి పూజ ప్రాంగణంలో విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బందికి అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఎ.టి.వి. రవికుమార్ సమగ్రంగా బ్రీఫింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు వీవీఐపీ, వీఐపీల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు, విధుల్లో పూర్తి అప్రమత్తత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ నిర్వహణ, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఏ చిన్న అవాంఛనీయ ఘటనకు కూడా అవకాశం లేకుండా ముందస్తు చర్యలతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

కార్యక్రమం విజయవంతంగా, ప్రశాంతంగా సాగేందుకు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ విధులను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని అదనపు ఎస్పీలు స్పష్టం చేశారు.

# మిస్సింగ్ కేసు మహిళ కాలువలో శవమైన వైనం

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఈ నెల నాలుగో తేదీన నమోదైన వృద్ధ మహిళ మిస్సింగ్ కేసులో, ఆమహిళ మృతదేహం పంటకాలువలో వెలుగు చూడటం ఓ మిష్టరీగా మారింది. వివరాల్లోకి వెళితే మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన ముంగర మాణిక్యం అనే, డెబ్బై సంవత్సరాల వృద్ధ మహిళ, ఈనెల 3వ, తేదీ మందులు కోసం తెనాలి రైల్వేస్టేషన్ ఏరియాకు వచ్చింది. ఆరోజు సాయంత్రానికి ఆమె ఇంటికి రాకపోవడంతొ,పలుచోట్ల వెదికిన కుటుంబ సభ్యులు నాల్గవ తేదీన, తెనాలి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ లొ, పిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుకట్టి దర్యాప్తు చేపట్టారు. ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం ప్రజలకు తెలియజేసారు. కాగా మండలంలోని కంచర్ల పాలెం గ్రామ శివారు కాలువలో, అచేతనంగా ఉన్న వృధ్ధురాలిని చూసిన ఆప్రాంత వాసులు, శుక్రవారం ఉదయం త్రీ టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, వృధ్ధురాలిని పరిశీలించి, మిస్సింగ్ కేసులోని వృధ్ధురాలిగా గుర్తించి, ఆమె బౌతిక కాయాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వృధ్ధురాలి మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. మందుబిళ్ళలకోసం తెనాలి వచ్చిన వృధ్దురాలు, పంటకాలువలొ శవమై కనిపించడం ఓ మిష్టరీగా మారింది.

## శాంతి భద్రతలే లక్ష్యం : ఎస్ఐ భాగ్యరాజ్



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** బాపట్ల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారి పై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతోందని ఎస్ ఐ భాగ్యరాజ్ తెలిపారు.

ఈ క్రమంలో స్టువర్టుపురం అవుట్ సైడ్, కావూరి వారి పాలెం రోడ్డులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులను పట్టుకొని కౌన్సిలింగ్ ఇచ్చి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని తెలిపి రూ. 1000/- ఫైన్ విధించడం జరిగిందన్నారు.

మద్యం సేవించదలచిన వారు ప్రభుత్వం అనుమతించిన (లైసెన్స్ ఉన్న) ప్రదేశాలలో మాత్రమే మద్యం సేవించాలి గాని, రోడ్లపై, ప్రజా ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ప్రజల శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, ప్రజలు కూడా చట్టానికి సహకరించాలని ఎస్సై భాగ్యరాజ్ తెలిపారు.

## లేమల్లెపాడులో పేకాటపై దాడులు



○ ఎనిమిది మంది అరెస్టు, నగదు-ఫోన్లు స్వాధీనం

**గుంటూరు:** వట్టి చెరుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లేమల్లెపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించింది. గ్రామంలోని వాటర్ ట్యాంకుల సెంటర్ సమీపంలో ఇంట్లో పేకాట జరుగుతోందన్న సమాచారం అందడంతో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌బీ హెచ్‌సీ, టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఎస్‌బీ సీఐ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సీఐకి తెలియజేసి, వట్టిచెరుకూరు ఎస్‌బీ బృందంతో కలిసి రైడ్ నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 27,500 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి, తదుపరి విచారణ కోసం నిందితులను వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐకి అప్పగించారు.

## బ్రహ్మం సాగర్ కాలువలో పడి మరొక యువకుడు మృతి

○ కాల్వ లో పడి వరుసగా ఇద్దరు యువకులు మృతి

○ శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

**బ్రహ్మంగారి మఠం( జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ కుడి కాలువలో వరుసగా ఇద్దరు యువకుల మృతి మండల వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతుంది నిన్నటి దినం ఒక యువకుడు మృతి దేహం లభించగా నేడు అదే కాలువలో మరొక యువకుడు మృత్యువాత పడి శవమైతే తేలాడు విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ శివప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని యువకుల మృతికి గల దర్యాప్తు చేయడం ప్రారంభించారు స్థానికులు విచారించగా వారు ఇచ్చిన సమాచారం మేరకు ప్రమాదవశాత్తు మృతి చెందారని వారు తెలిపారు అనంతరం మృతి చెందిన యువకులను పోస్టుమార్టం నిమిత్తం బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు తదుపరి పోస్టుమార్టం రిపోర్ట్ ల ఆధారితంగా విచారణ జరుపుతామని వారు తెలిపారు.

# ప్రజలు ఛీకొట్టినా మార్పు రాదా ? : ఎమ్మెల్యే నసీర్

○ లడ్డూ కల్తీ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకే వైసీపీ నాటకాలు

○ సీఎం చంద్రబాబు ఇంటిపై దాడి జోగి పని కాదా ?

○ ప్రజల కోసం అసెంబ్లీకి ఎప్పుడైనా వచ్చారా ?

○ జగన్ యాత్రలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు

○ వైసీపీ అధినేతపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఫైర్

○ నియోజకవర్గంలో రూ.3.73 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలు ఛీ కొట్టి ప్రతిపక్షం కూడా లేకుండా చేసినా పులివెందుల శాసనసభ్యుడు జగన్ లో మార్పు రాలేదని, ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ సమస్యలపై మాట్లాడేందుకు కనీసం అసెంబ్లీ కూడా రాని జగన్ ఇప్పుడు పరామర్శల పేరుతో రోడ్డెక్కడం చూస్తే ప్రతి ఒక్కరూ అసహ్యించుకుంటున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 3, 9 డివిజన్లోని బాలాజీ నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాలలో శుక్రవారం రూ. 3.73 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా అభివృద్ధికి దూరమైన అన్ని ప్రాంతాల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వైసీపీ పాలకులు తట్టమట్టి కూడా వేయకుండా అన్ని ప్రాంతాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. సీఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తాము ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. అందులో భాగంగా ఇప్పటికే రూ. 46 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని వెల్లడించారు. మరో రూ. 36 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. సీఎం నారా చంద్రబాబునాయుడు ఇంటిపై జోగి రమేష్ దాడులకు తెగబడినప్పుడు జగన్మోహన్ రెడ్డి ఎక్కడకి వెళ్లారని ప్రశ్నించారు. ఇప్పుడు పరామర్శల పేరుతో దొంగ యాత్రలు చేస్తూ జగన్ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూల తయారీలో కల్తీ నిజమని తేలడంతో వైసీపీ నాయకులే రాష్ట్రంలో అల్లర్లకు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు ఇవన్నీ రాష్ట్ర ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారనే విషయం జగన్ సైకో సైన్యం తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ యల్లావుల అశోక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బకాయిల చెల్లింపుపై శాసనమండలిలో తమ వాణి వినిపించాలి

○ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని కోరిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా న్యాయమైనవని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అభిప్రాయ పడ్డారు. ఆ సమస్యలు పరిష్కరించకపోగా వారి హక్కులను కూడా కాలరాయాలని చూడడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల తరుపున శాసనమండలిలో తమ వాణి వినిపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు గుంటూరులోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయనను కలిసి తమ సమస్యలను ఆయనకు సమగ్రంగా వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేల కోట్లలో ప్రభుత్వం బకాయి పడిందని, దానిని ఒకేసారి నగదు రూపంలో చెల్లించడానికి వీలు కాని పక్షంలో దానికి ప్రతిగా ప్రభుత్వ భూములు కేటాయించాలని వారు కోరారు.

ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులైన ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూడటం తగదన్నారు. ఉద్యోగులకు చెల్లించకుండా పేరుకు పోయిన వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలా వీలు కాని పక్షంలో వారి కోరిక మేరకు ప్రభుత్వ భూములు కేటాయించాలని ఆయన సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు వేతన సవరణ చేసి మెరుగైన పిఆర్సీ ఇవ్వాల్సిందే అన్నారు. ముగ్గురు సభ్యులతో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, దాని నివేదిక వచ్చే లోపు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టివి రామిరెడ్డి, వై నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# విభిన్న కథాంశంతో త్వరలో విడుదల కానున్న చిత్రం చైనాపీస్

○ తెనాలిలో సినిమా ప్రమోషన్ ఏర్పాటుచేసిన చిత్ర యూనిట్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** విభిన్న కథాంశంతో ఆద్యాంతం ప్రేక్షకులను అలరింపజేసే వినూత్న ప్రయత్నమే చైనా పీస్ చిత్రమని చిత్ర దర్శకులు అక్కి విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సుల్తానాబాద్ వద్దగల గిస్మత్ హోటల్ ప్రాంగణంలొ శుక్రవారం చైనా పీస్,చిత్ర నిర్మాత,దర్శకులైన అక్కి విశ్వనాథరెడ్డి తమ చిత్ర ప్రధాన పాత్రధరులతొ, సినిమా ప్రమోషన్,మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్ పై, విభిన్న కథాంశంతొ, కొత్తదనం కోరుకునే ప్రేక్షకుల అభిలాషకు తగిన విధంగా రూపొంచిన చైనా పీస్ చిత్ర విశేషాలను మీడియాతొ పంచుకున్నారు.

మల్టీ టాలెంట్ వర్ధమాన నటులతొ, ఉన్నతమైన భావాలతొ, చిత్ర నిర్మాత,దర్శకత్వ బాధ్యతలు కూడ చేపట్టిన అక్కి విశ్వనాధరెడ్డి మాట్లాడుతు జాతీయ భద్రత, గూఢచర్యం,భౌగోలిక, రాజకీయ, ఉద్రిక్తతలతో, ఇద్దరు స్నేహితుల మధ్య, ఏర్పడిన సమస్యకు, పరిష్కారం వెదికే ప్రయత్నంలొ,కథలొ అనేక మలుపులు ఉన్నాయన్నారు. చిత్ర కథానాయకుల్లొ ఒకరైన నిహాల్ కోదాటి మాట్లాడుతు బాలనటుడుగా అనేక చిత్రాల్లొ నటించానని కళాశాల విద్యార్థిగా తెనాలితొ తనకు అనుబంధం ఉందన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థలొ ఇంజనీరింగ్ చేసిన తనకు, సినీ రంగంలొ రాణించాలన్న, కుతూహలానికి, చైనా పీస్ చిత్రం మంచి గుర్తింపు తెస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చిత్ర కథానాయి శ్రీజ మాట్లాడుతు చిత్రంలొ తన పాత్రకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. అనుకున్నది అనుకున్నట్లు జరగాలన్న నైజం పాత్ర లక్షణ మన్నారు. మార్చి నెల మొదటి వారంలొ చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. విశ్వసనీయతను పరీక్షించే నీడ, ప్రపంచాన్ని అన్వేషిస్తుందని, మల్టీ టాలెంట్ నటులతొ, ప్రేక్షకులకు వినూత్నతను పంచే చిత్రం కానుందన్న నమ్మకాన్ని చిత్ర దర్శకులు, వ్యక్తం చేశారు. చిత్ర యూనిట్ కు హిందుస్తాన్ స్కౌట్ అండ్ గైడ్స్ రాష్ట ఉపాధ్యక్షులు పెసర్లంక రమణ, యువక్రికెట్ అకాడమి నిర్వాహకులు మాలిక్,వారి మిత్రబృందం స్వాగతం పలికి, దుశ్శాలువలతొ సత్కరించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా రామకృష్ణ కవి కళాక్షేత్రంలో త్వరలో ఏర్పాటు చేయనున్న, ది అల్టిమేట్ లైవ్ గేమ్ షో, అవార్డు ఫంక్షన్ బ్రోచర్లను, చిత్ర యూనిట్ తొ కలిసి ఆవిష్కరించారు.

# పేదవారికి సేవలందించడం శుభపరిణామం



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ముందుకు రావడం శుభ పరిణామం అని చందోలు ఎస్సై మర్రి శివ కుమార్ అన్నారు. చందోలు గ్రామానికి చెందిన మల్లెల ఏసోబు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ కుటుంబ పోషణకు కష్టంగా మారడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎస్సై శివ కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా చందోలు ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు కలిసికట్టుగా పేదవారికి సేవలందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. చందోలు గ్రామానికి చెందిన మల్లెల ఏసోబు రోడ్డు ప్రమాదానికి గురై వైద్యశాలలో చికిత్స పొంది కుటుంబ పోషణ గడవక ఇబ్బందులు పడుతున్న తరుణంలో పేదవారికి సేవలు అందించడానికి మేమున్నామంటూ ముందుకు వచ్చి తన చేతుల మీదుగా బాధితుడికి ఆర్థిక సహాయం అందించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడానికి యువత మరింత ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, నందిపాటి శ్రీరామ్ సునీల్,నరాల శెట్టి నాగరాజు,పెద్దమల్లు శ్రీకాంత్, అక్కి శ్రీను, నరాలశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నీటి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నీటి నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో నీటి నాణ్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అన్నారు. భవిష్యత్తులో నీటి నాణ్యత సవాళ్లపై దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కేంద్ర భూగర్భ జలాల బోర్డు (సీజీడబ్ల్యూబీ), దక్షిణ ప్రాంతం, హైదరాబాద్ ఆధ్వర్యంలో "గుంటూరు, అమరావతి విజయవాడ పట్టణ సముదాయాల కోసం అక్విఫర్ మ్యాపింగ్ మరియు నిర్వహణ ప్రణాళిక – డేటా ప్రచారం మరియు వినియోగం" అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. అక్విఫర్ మ్యాపింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ 2.0 కింద రూపొందించిన భూగర్భ జలాల శాస్త్రీయ సమాచారాన్ని ప్రచారం చేయడం, జిల్లా స్థాయి శాఖలు వాటిని సమర్థవంతంగా వినియోగించుట లక్ష్యంగా వర్క్‌షాప్ సాగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల వల్ల భూగర్భ జలాల లభ్యత, నాణ్యతకు సంబంధించిన సవాళ్లు పెరుగుతున్నాయని తెలిపారు. గుంటూరు, అమరావతి పట్టణ సముదాయాల్లో కేంద్ర భూగర్భ జలాల బోర్డు చేపట్టిన సమగ్ర అధ్యయనాన్ని ఆమె అభినందించారు. గ్రామ స్థాయి శాస్త్రీయ సమాచారాన్ని జిల్లా ప్రణాళిక, నీటి సంరక్షణ, వినియోగ నియంత్రణ వ్యూహాల్లో సమన్వయం చేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.

కేంద్ర భూగర్భ జలాల బోర్డు, దక్షిణ ప్రాంతం, హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త టి. మాధవ్ ఈ కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. ముఖ్యంగా గుంటూరు, అమరావతి, విజయవాడ పట్టణ సముదాయాల వంటి వేగంగా పట్టణీకరణ జరుగుతున్న ప్రాంతాల్లో స్థిరమైన భూగర్భ జలాల యాజమాన్యం కోసం శాఖల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు.

సీజీడబ్ల్యూబీ శాస్త్రవేత్త డా. ఎస్.ఎస్. విఠల గుంటూరు, అమరావతి, విజయవాడ పట్టణ సముదాయాలకు సంబంధించిన హైడ్రోజియోలాజికల్ నిర్మాణం, అక్విఫర్ లక్షణాలు, భూగర్భ జలాల వనరులు, నీటి నాణ్యత సమస్యలు, నిర్వహణ ప్రణాళికలు, తాగునీటి అవసరాల కోసం సురక్షిత ప్రాంతాల గురించి వివరించారు. అక్విఫర్ మ్యాపింగ్ స్టడీస్ 2.0 ముఖ్యాంశాలను ప్రస్తుతిస్తూ, భూగర్భ జలాల దీర్ఘకాల స్థిరత్వం కోసం అనుసరించాల్సిన చర్యలను సూచించారు.

ఈ సందర్భంగా కేంద్ర భూగర్భ జలాల బోర్డు రూపొందించిన సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఇంటరాక్టివ్ సెషన్‌లో అక్విఫర్ మ్యాపులు, నిర్వహణ ప్రణాళికలను నిర్ణయాలు తీసుకోవడంలో, అభివృద్ధి ప్రణాళికల్లో, భూగర్భ జలాల రీచార్జ్, సంరక్షణ చర్యల అమలులో ఎలా వినియోగించాలనే అంశాలపై చర్చించారు.

ఈ వర్క్‌షాప్‌లో కేంద్ర భూగర్భ జలాల బోర్డు శాస్త్రవేత్త పెరిక యాదయ్య, భూగర్భ జలాలు, వాటర్ ఆడిట్ శాఖ ఉప సంచాలకులు డి. వందనం, డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్రబాబు, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మఠాధిపతి పట్టాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



○ ఫిబ్రవరి 26న 8వ తరం 12వ మఠాధిపతిగా శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి పట్టాభిషేకం

**బ్రహ్మంగారి మఠం( జర్నలిస్ట్ ఫైల్)** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నకు 8వ తరం 12వ మఠాధిపతిగా శ్రీశ్రీశ్రీ వెంకటాద్రి స్వామి వారి పట్టాభి మహోత్సవ ఆహ్వాన పత్రికను మఠం ఆలయం మేనేజర్ ఈశ్వరయ్య చారి చేతుల మీదుగా మఠాధిపతుల సోదరులు వీరంభట్లయ్య స్వామి దత్తాత్రేయ స్వామి వారి బావమరిది పిపిఎన్ ప్రసాద్ సమక్షంలో ఈనెల 26వ తేదీన జరుగు నూతన మఠాధిపతి పట్టాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మొదటి పత్రికను మఠం ఆలయ ప్రధాన అర్చకులు వీరబ్రహ్మయాచార్యులు శ్రీ ఈశ్వర దేవి మఠాధిపతులు శ్రీ శ్రీ శివ కుమార స్వాముల వారికి అందజేశారు అనంతరం బ్రహ్మంగారి ప్రియ శిష్యుడైన సిద్దయ్యగారి మఠానికి చేరుకొని సిద్దయ్య గారి వంశస్తులైన వంశవారుసులకు ఆహ్వాన పత్రికను అందజేసి 26వ తేదీ జరిగే మఠాధిపతుల పట్టాభిషేక మహోత్సవానికి అందరూ విచ్చేసి విజయవంతం చేసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు తెలియజేశారు అంతేకాకుండా ఈ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమానికి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి భక్తులు శిష్యులు గ్రామ ప్రజలు ఆత్మీయ మిత్రులు శ్రేయోభిలాషులు అందరూ కూడా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలనని వారు పిలుపునిచ్చారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



○ మంత్రి నారా లోకేష్ చొరవతో 7 మంది లబ్ధిదారులకు రూ.9.75 లక్షల ఆర్థిక భరోసా

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను మంత్రి నారా లోకేష్ చొరవతో టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ సహాయం అందిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. వైద్య చికిత్సలు, ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా చెక్కుల రూపంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలమూరి విజయ్ కుమార్‌కు రూ. 3,26,445, భావన సుధారాణికి రూ. 2,86,735, కూరపాటి ప్రమీలకు రూ. 1,62,000,జవ్వాది రత్నజలికి రూ. 72,419, చల్లపల్లి గంగాధర్ రావుకు రూ. 53,047,నెప్పల్లి శ్రీకాంత్‌కు రూ. 40,350, అన్నే నాగేశ్వరరావుకు రూ. 35,000,చొప్పున చెక్కులు అందజేయగా, మొత్తంగా రూ. 9,75,996, విలువైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అందజేసినవారిలో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, యేళ్ళ శివరామయ్య,మాదల రమేష్‌బాబు, మొద్దుకూరి రమేష్‌బాబు, నడపన దుర్గారావు, యేళ్ళ మల్లయ్య,యేళ్ళ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# బాల సదనంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** బాపట్ల పట్టణంలోని బాల సదనాన్ని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సదనంలోని వసతులను, రికార్డులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలు, తాగునీరు మరియు గదుల పరిశుభ్రతను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు.

బాల సదనంలోని పిల్లలతో ఆయన సరదాగా గడిపారు. వారికి అందుతున్న విద్యా బోధన, భోజనం నాణ్యత మరియు ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని పిల్లలకు భరోసా ఇచ్చారు. సదనంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పారిశుధ్యం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పిల్లల భద్రత మరియు ఆరోగ్యం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరుపేద పిల్లలకు అండగా ఉండి, వారికి మెరుగైన భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, బాల సదనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులు, అధికారులు మరియు సదనపు సిబ్బంది పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

